

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

జర్నలిస్ట్ శక్తి ప్రజల పక్షం
జర్నలిస్ట్ సంక్షేమం లక్ష్యం
TJWA
Regd. No: 288/2026
తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్
తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ – సంక్షేమమే మా ధ్యేయం

శుక్రవారం 30 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 149 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

తెలంగాణలో డేటా సెంటర్లకు ప్రత్యేక అగ్నిమాపక భద్రతా నిబంధనలు



హైదరాబాద్, అక్టోబర్ 30 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో డేటా సెంటర్ల భద్రతను బలోపేతం చేసేందుకు అగ్నిమాపక, విపత్తుల స్పందన, అత్యవసర సేవలు, పౌర రక్షణ శాఖ ప్రత్యేక అగ్నిమాపక, ప్రాణరక్షణ భద్రతా మార్గదర్శకాలను జారీ చేసింది. రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్, 2026 అక్టోబర్ 28న ఆర్సీ నంబర్ 3455/MSB/2026తో సర్క్యులర్ మెమోరాండం విడుదల చేశారు. డేటా సెంటర్లకు సంబంధించిన తాత్కాలిక అగ్నిమాపక నిరభ్యంతర ధ్రువపత్రాల (ప్రొవిజనల్ ఫైర్ ఎన్ఓసీ) దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంలో ఈ మార్గదర్శకాలు కీలకంగా మారనున్నాయి. రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించడంతోపాటు వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంచడం, అగ్నిమాపక భద్రతా నిబంధనలకు అనుగుణంగా అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. డేటా సెంటర్లలో సర్వర్లు, డేటా నిల్వ వ్యవస్థలు, నెట్‌వర్కింగ్ పరికరాలు, నిరంతర విద్యుత్ సరఫరా వ్యవస్థలు, యూపీఎస్‌లు, బ్యాటరీలు, ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు, ఇంధన నిల్వ కేంద్రాలు, విస్తృతమైన కేబుల్ నెట్‌వర్క్‌లు ఉండటంతో అగ్నిప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉండే అవకాశాన్ని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థలు, అలారాలు, తగిన అగ్నిమాపక పరికరాలు, అగ్ని వ్యాప్తిని నిరోధించే విభజనలు, అగ్నిమాపక సిబ్బంది వినియోగానికి ప్రత్యేక మెట్లు, వెట్ రైజర్లు, అత్యవసర సమయంలో సురక్షితంగా వేచి ఉండే ప్రదేశాలు, తగినంత నీటి నిల్వలు, పంపింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. పరిపాలనా విభాగాల్లో ఆటోమేటిక్ స్ప్రింక్లర్ వ్యవస్థలను ఏర్పాటు చేయడంతోపాటు సాంకేతిక విభాగాల్లోని కీలక పరికరాల రక్షణకు వాటర్ మిస్ట్ లేదా క్లీన్ ఏజెంట్ గ్యాస్ ఆధారిత అగ్నిమాపక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యాటరీ గదులు, యూపీఎస్ గదులు, ట్రాన్స్‌ఫార్మర్ గదులు, స్విచ్‌గేర్ గదులు, ఇతర కీలక విద్యుత్ వ్యవస్థల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, సమగ్ర అగ్ని ప్రమాద ముప్పు అంచనా నిర్వహించాలని ఆదేశించారు. తగిన వెంటిలేషన్, అగ్నిని తట్టుకునే విభజనలు, అత్యవసర సమయంలో విద్యుత్ వ్యవస్థలను నిలిపివేసే ఏర్పాట్లు, ఇంధన నిల్వ కేంద్రాలకు అవసరమైన రక్షణ చర్యలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. సాధారణ వాణిజ్య భవనాలతో పోలిస్తే డేటా సెంటర్లలో వ్యక్తుల సంఖ్య తక్కువగా ఉండే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని ఈ మార్గదర్శకాలను రూపొందించారు. అగ్నిప్రమాదాలను గుర్తించే, నివారించే వ్యవస్థలను భవన నిర్వహణ వ్యవస్థలు, అత్యవసర స్పందన వ్యవస్థలతో అనుసంధానించాలని సర్క్యులర్‌లో సూచించారు. డేటా హాళ్లు, ఇతర కీలక ప్రాంతాల్లో అట్టపెట్టెలు, ప్యాకింగ్ సామగ్రి, చెక్క ప్యాలెట్లు, వ్యర్థాలు వంటి సులభంగా మండే పదార్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, బేస్‌మెంట్ అంతస్తులు, కీలక మౌలిక సదుపాయాల రక్షణకు నిర్దేశించిన ప్రత్యేక నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు. దరఖాస్తులను పరిశీలించే అధికారులు ప్రతిపాదిత భవనాల్లోని భద్రతా ఏర్పాట్లు సర్క్యులర్‌లో పేర్కొన్న నిబంధనలు, ఆమోదించిన అగ్నిమాపక భద్రతా రూపకల్పనకు అనుగుణంగా ఉన్నాయో లేదో తప్పనిసరిగా ధ్రువీకరించాలని డైరెక్టర్ జనరల్ ఆదేశించారు. ఈ మార్గదర్శకాలు 2026 నవంబర్ 6వ తేదీ నుంచి సమర్పించే తాత్కాలిక ఫైర్ ఎన్ఓసీ దరఖాస్తులకు వర్తించనున్నాయి. రాష్ట్రంలోని డేటా సెంటర్లలో అగ్నిప్రమాదాల నివారణను బలోపేతం చేయడం, అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే సన్నద్ధతను పెంచడం, కీలక మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించడం ఈ మార్గదర్శకాల ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ అగ్నిమాపక శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చు.





నిమ్స్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలి: మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, అక్టోబర్ 30 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు చేపట్టిన నిమ్స్ విస్తరణ ప్రాజెక్టు, గోషామహల్‌లో నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ రెండు కీలక ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిపై గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, తదుపరి చేపట్టాల్సిన నిర్మాణ కార్యక్రమాలపై మంత్రి సమీక్షించారు. గోషామహల్‌లో నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు 23 శాతం పూర్తయ్యాయని, నిమ్స్ విస్తరణ ప్రాజెక్టులో భాగంగా భవన నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో ఈ రెండు ప్రాజెక్టులు కీలక పాత్ర పోషించనున్నాయని మంత్రి పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యరంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. కీలకమైన ఈ ఆసుపత్రుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్. చొంగ్తు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

హైదరాబాద్, అక్టోబర్ 30 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి కేటాయించిన ప్రత్యేక అభివృద్ధి నిధులను లక్షిత వర్గాల సంక్షేమానికే వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఇతర అవసరాలకు మళ్లకుండా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయం, ఇంధనం, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక తదితర శాఖల్లో సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిధుల ఖర్చు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న ప్రయోజనాలను సమగ్రంగా సమీక్షించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. భూమి యాజమాన్యం ఆధారంగా అమలవుతున్న పథకాల వల్ల సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో ఏర్పడుతున్న వ్యత్యాసాలను గుర్తించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి, వారి పేర్లు, గ్రామాలు, సామాజిక వర్గం, అందిన ప్రయోజనాలతో కూడిన డిజిటల్ రికార్డులను రూపొందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ల నుంచి అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో సుమారు 1,300 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నట్లు అధికారులు సమావేశంలో వివరించగా, ఆ భూమిని అవసరాలకు అనుగుణంగా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే గుర్తించిన స్థలాలను అర్హులైన కుటుంబాలకు అందించేందుకు అవసరమైన అనుమతులు, తదుపరి చర్యలను వేగవంతం చేయాలని, గృహ స్థలాలు లేని కుటుంబాల కోసం అవసరమైన చోట భూసేకరణ ప్రతిపాదనలను పరిశీలించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో విద్యుత్ సదుపాయాలు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానవాటికలు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. విద్యుత్ సౌకర్యాలు లేని ఆవాసాలను గుర్తించి విద్యుత్ లైన్లు, స్తంభాలు, వైరింగ్ వంటి పనులను చేపట్టాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక అవసరాలను గుర్తించి ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలని భట్టి విక్రమార్క సూచించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తరించేందుకు మొబైల్ వైద్య యూనిట్ల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని, వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో గిరిజనులకు సకాలంలో వైద్య సేవలు అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు విద్యుత్, గృహ వసతి, వైద్యం, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఇరువురు మంత్రులు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు నవీన్ మిట్టల్, సందీప్‌కుమార్ సుల్తానియా, సురేంద్రమోహన్, సిక్తా పట్నాయక్, క్రిస్టినా, విజయేంద్రబోయి, గోపి, గుగులోతు రవి నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ప్రారంభమైన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్



న్యూఢిల్లీ, అక్టోబర్ 30 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించడం, రాష్ట్రాన్ని అంతర్జాతీయ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 కర్టెన్ రైజర్ కార్యక్రమం ఢిల్లీలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేరుకోగా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు పారిశ్రామికవేత్తలు, వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రసంగిస్తూ వివిధ రంగాల్లో హైదరాబాద్ సాధించిన పురోగతి, పరిశ్రమలకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతుపై ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో గుర్తింపు సాధించిందని, రక్షణ రంగం, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం కీలక కేంద్రంగా ఎదిగిందని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించారని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను సిద్ధం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న సహకారం, వివిధ రంగాల్లో అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరై, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయడంతోపాటు కొత్త పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన, ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.



తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కండి: సీఎం రేవంత్‌రెడ్డి

ఢిల్లీ, అక్టోబర్ 30 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రపంచ పెట్టుబడిదారులు, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, పెట్టుబడుల వృద్ధికి అవసరమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో తాను వ్యక్తిగతంగా చొరవ చూపుతానని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు సన్నాహకంగా గురువారం రాత్రి ఢిల్లీలో నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. హైదరాబాద్‌కు శతాబ్దాలుగా అంతర్జాతీయ వాణిజ్య కేంద్రంగా గుర్తింపు ఉందని, ప్రపంచీకరణ అనే పదం ప్రాచుర్యంలోకి రాకముందే వివిధ దేశాల వ్యాపారులు ఇక్కడికి వచ్చి వ్యాపారాలు నిర్వహించేవారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. చారిత్రకంగా ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, హస్తకళా వస్తువుల వ్యాపారానికి హైదరాబాద్ ప్రసిద్ధి చెందిందని, కాలక్రమంలో విద్య, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లోనూ ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిందని వివరించారు. హైదరాబాద్‌లో విద్యనభ్యసించిన పలువురు ప్రముఖులు అంతర్జాతీయ సంస్థల్లో కీలక బాధ్యతలు చేపట్టడం నగర ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలో సాంకేతిక, ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మాజీ ప్రధానులు రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు సేవలను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన మార్పులు దేశ ప్రగతికి దోహదపడ్డాయని, 1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపాయని అన్నారు. హైదరాబాద్ వ్యాపార స్నేహపూర్వక, పారిశ్రామిక అభివృద్ధి, ప్రపంచ దృక్పథంతో ముందుకు సాగుతోందని తెలిపారు. తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యాలను వివరిస్తూ, 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అప్పటికి భారతదేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే క్రమంలో దేశ స్థూల జాతీయోత్పత్తిలో తెలంగాణ వాటాను ప్రస్తుత ఐదు శాతం నుంచి పది శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు తమ వ్యాపార విస్తరణ, పెట్టుబడులు, లాభాల వృద్ధికి సంబంధించి మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కోరారు. పరిశ్రమల అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పారిశ్రామికవేత్తల సూచనలను స్వీకరించి అవసరమైన విధానపరమైన మార్పులు చేపడతామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి విషయంలో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ముఖ్యమంత్రి, హైస్పీడ్ రైలు కారిడార్లు, ప్రాంతీయ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, విమానాశ్రయాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి రాష్ట్ర భవిష్యత్ వృద్ధికి దోహదపడతాయని తెలిపారు. హైదరాబాద్ పోటీ కేవలం దేశీయ నగరాలతోనే కాకుండా న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి ప్రపంచ నగరాలతోనూ ఉండాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయి ఆలోచనలు, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను తెలంగాణకు తీసుకురావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. యువతను భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం, ఉపాధి అవకాశాలను పెంచడం ద్వారా తెలంగాణను ఆర్థికాభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ప్రపంచ పెట్టుబడిదారులు భాగస్వాములైతే కొత్త అవకాశాలు సృష్టించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు అభిషేక్ మను సింఘ్వీ, రేణుకా చౌదరి, డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సూర్యాపేటను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు యూనిసెఫ్‌తో ఒప్పందం

సూర్యాపేట, అక్టోబర్ 30 – సందేశం టైమ్స్ ప్రతినిధి: జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో సూర్యాపేట జిల్లా యంత్రాంగం యూనిసెఫ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పిల్లల హక్కుల పరిరక్షణతో పాటు వారి స్వేచ్ఛ, అభిరుచులు, ఆలోచనా విధానాలపై అవగాహన పెంపొందించేందుకు గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు, విద్యాశాఖ క్లస్టర్, గ్రామస్థాయి రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. పిల్లల హక్కులు, మానసిక వికాసం, ఆలోచనా సరళి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి అధికారి బాలల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పిల్లలు తమ హక్కులను, స్వేచ్ఛను పూర్తిస్థాయిలో అనుభవించేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. బాలల్లోని నైపుణ్యాలు, అభిరుచులను గుర్తించి, వారు తమ ప్రతిభను స్వచ్ఛందంగా ప్రదర్శించేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ శిక్షణ సూర్యాపేటను ఆదర్శ బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్స్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనుష, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి. రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉపేంద్ర, వివిధ ప్రాజెక్టుల సీడీపీవోలు, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి





అనంతగిరి, అక్టోబర్ 30 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు యాసంగి పంటల సాగు ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అందె సతీష్ సూచించారు. అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో రైతులకు నిర్వహించిన ‘ఖేత్ బచావో అభియాన్’ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు ఏర్పడితే భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి వనరులు పరిమితంగా ఉన్న రైతులు వరి సాగుకు బదులుగా పెసర, మినుము, బొబ్బర్లు, శనగ, వేరుశనగ వంటి ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గడ్డిపల్లి వ్యవసాయ శాస్త్రవేత్త ఆదర్శ్ మాట్లాడుతూ వరి సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరమవుతుందని, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేపడితే పంట మధ్యలో నీటి కొరత ఏర్పడి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు తమ భూముల స్వభావం, నేలలోని తేమ, అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిగణనలోకి తీసుకుని అనువైన పంటలను ఎంచుకోవాలని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని పాటించడం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం, సేంద్రియ ఎరువులను ప్రోత్సహించడం ద్వారా నేల సారవంతతను కాపాడుకోవచ్చని వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించాలని కోరారు. గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ భూగర్భ జలాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, నీటిని పొదుపుగా వినియోగిస్తూ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో మార్పులు చేసుకోవాలని రైతులకు సూచించారు. గ్రామంలోని నీటి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అన్వేష్, హెచ్‌ఈవో ఇస్మాయిల్, పంచాయతీ కార్యదర్శి సౌమ్య, రైతులు కొల్లు సుబ్బారావు, గద్దె రామారావు, దేవులపల్లి నరసింహారావు, రేవూరి శ్రీనివాసరావు, గుండ్లపల్లి వెంకన్న, గూడపురి కోటయ్య, కొరివి వెంకటేశ్వర్లు, బుర్రా వీరబాబు, దామూలూరి సత్యనారాయణ, వీరబోయిన సైదులు, బుర్రా నాగమల్లేశ్వరరావు, నేరెళ్ల చంద్రయ్య, మల్లెబోయిన మల్సూరు, వార్డు సభ్యుడు బొడ్డుపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో మున్సిపల్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలకు కలెక్టర్ ఆదేశం

సూర్యాపేట, అక్టోబర్ 30 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఎంట్రీ ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగించారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. మున్సిపల్ ఆస్తి పన్ను రికార్డులను అక్రమంగా సృష్టించి, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై క్రిమినల్ ఫిర్యాదు నమోదు చేయడంతోపాటు సమగ్ర విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్‌లో సుమారు 192 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న మున్సిపల్ బావి, దాని పక్కన ఉన్న భూమికి సంబంధించి ఈ వివాదం తలెత్తింది. ఈ స్థలానికి అక్రమంగా మున్సిపల్ ఆస్తి పన్ను మదింపు రికార్డులు సృష్టించి, వాటిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగించినట్లు ఆరోపణలు వచ్చాయి. హుజూర్‌నగర్ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ సమర్పించిన నివేదికలను పరిశీలించిన కలెక్టర్ చర్యలకు ఆదేశించారు. ఆస్తి రికార్డుల సృష్టి, ధ్రువీకరణ, ప్రాసెసింగ్‌లో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రెవెన్యూ ఆఫీసర్/రెవెన్యూ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్‌పై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వారు ఎక్కడ పనిచేస్తున్నా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించగా, సంబంధిత అవుట్‌సోర్స్ డేటా వివాదాస్పద స్థలాన్ని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, భూమి యాజమాన్యం, విస్తీర్ణం, హద్దులను నిర్ధారించి రికార్డులను చట్టప్రకారం సరిచేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. మున్సిపల్ ఆస్తి రికార్డులను మోసపూరితంగా సృష్టించడం, దుర్వినియోగం చేయడం, అక్రమ లావాదేవీల్లో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసరించిన విధానాలపై సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ ద్వారా నివేదిక సమర్పించాలని కోరారు. ఈ వ్యవహారంపై సూర్యాపేట అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు/రెవెన్యూ) సమగ్ర విచారణ చేపట్టనున్నారు. జిల్లాలోని మున్సిపల్ భూములు, బావులు, రహదారులు, ప్రజా స్థలాలు, ఇతర ఆస్తులకు సంబంధించి ఇలాంటి అక్రమాలు జరిగాయా అనే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు. సంబంధిత అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల పాత్రపై విచారణ జరిపి 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని, అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో రుజువైతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

30 తులాల బంగారం చోరీ కేసును ఛేదించిన మెదక్ జిల్లా పోలీసులు.. అంతర్రాష్ట్ర ముఠా సభ్యురాలి అరెస్ట్, 25 తులాల ఆభరణాలు స్వాధీనం





మెదక్, అక్టోబర్ 30(సందేశం టైమ్స్): రాఖీ పండుగ సందర్భంగా బస్సులో 30 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైన కేసును నిజాంపేట పోలీసులు ఛేదించి, అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన మేకల సంధ్య (30)ను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి సుమారు 25 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. నల్గొండకు చెందిన నూరం స్నేహ ఆగస్టు 26న రాఖీ పండుగ సందర్భంగా తన 30 తులాల బంగారు ఆభరణాలను బ్యాగులో పెట్టుకుని నిజాంపేటలోని తన తల్లిగారి ఇంటికి బయలుదేరగా, అక్కడికి చేరుకున్న తర్వాత బ్యాగులో నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితురాలిని గుర్తించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ మార్గదర్శకంలో, తూప్రాన్ డీఎస్పీ జి. నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో రామాయంపేట సీఐ బి. సైదా, నిజాంపేట ఎస్ఐ బి. రాజేష్‌లతో కూడిన ప్రత్యేక బృందాలు ఈ కేసును ఛేదించాయి. విచారణలో నిందితురాలు తన తల్లి నతుపాటి రాధిక, బంధువు అక్షింతల సంధ్య, బండి మోజెస్, బండి దుర్గలతో కలిసి ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడినట్లు వెల్లడైందని ఎస్పీ తెలిపారు. చోరీ అనంతరం స్విఫ్ట్ కారు (TS 08 EF 6174)లో హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడి నుంచి ఇన్నోవా క్రిస్టా (TG 07 G 1888)లో పరారైనట్లు పేర్కొన్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ముఠా సభ్యులు ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా పరస్పరం సమాచారాన్ని పంచుకునేవారని, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమండ్రి, నిజామాబాద్, మెదక్ ప్రాంతాల్లోని బస్టాండ్లలోనూ చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితురాలి నుంచి నాలుగు బంగారు చైన్లు, నాలుగు లాకెట్లు, ఒక వుస్తెల తాడు, 13 ఉంగరాలు, ఒక ప్లాటినం ఉంగరం, నల్లపూసల దండలు, కంకణాలు, గాజులు, కమ్మలు, చంపస్వరాలు, ముక్కెర, సిక్ర పువ్వు తదితర సుమారు 25 తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు మిగిలిన సొత్తును స్వాధీనం చేసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. బస్సులు, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించే ప్రజలు తమ విలువైన ఆభరణాలు, నగదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా చోరీ జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. ఈ కేసును వేగంగా ఛేదించి నిందితురాలిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన రామాయంపేట సీఐ సైదా, ఎస్ఐలు రాజేష్, బాలరాజ్, హెడ్ కానిస్టేబుల్ సునీత, కానిస్టేబుళ్లు రాకేశ్, భాస్కర్, నాగభూషణ్, సాజిద్, లక్ష్మణ్, రాజు, కృష్ణ, శ్రీనివాస్ నాయక్, ఐటీ కోర్ సిబ్బంది విజయ్, వెంకట్, మహేందర్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.



నర్సాపూర్‌లో మంచినీటి ప్లాంట్ల ఆకస్మిక తనిఖీలు.. వృథా నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించాలి: మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్

మెదక్ జిల్లా నర్సాపూర్, అక్టోబర్ 30 (సందేశం టైమ్స్): నర్సాపూర్ పట్టణంలోని వివిధ మంచినీటి ప్లాంట్లను మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లాంట్లలో ఫిల్టర్ల ద్వారా వెలువడే వృథా నీటిని మురుగు కాలువల్లోకి వదలకుండా, బోర్ల పరిసరాల్లో ఇంకుడు గుంతలు నిర్మించి వాటిలోకి మళ్లించాలని ప్లాంట్ల యజమానులను ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపడతామని ప్లాంట్ల యజమానులు కమిషనర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంచినీటి ప్లాంట్ యజమాని తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. ఈ తనిఖీల్లో వార్డు అధికారులు మహేందర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, రాములు, ప్రవీణ్, నాగేంద్రబాబు, శానిటరీ ఇన్‌చార్జి సల్ల మురళీమోహన్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పోక్సో చట్టంపై విద్యార్థులకు న్యాయ అవగాహన.. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు: జూనియర్ సివిల్ జడ్జి ఎం. హేమలత

నర్సాపూర్, అక్టోబర్ 30 (సందేశం టైమ్స్): సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని డాన్ బాస్కో పాఠశాలలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. హేమలత మాట్లాడుతూ బాలల హక్కులు, భద్రత, రక్షణ, సంక్షేమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలబాలికలు భయం లేకుండా సురక్షిత వాతావరణంలో జీవిస్తూ విద్యను అభ్యసించడంతోపాటు తమ హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కు కలిగి ఉంటారని తెలిపారు. బాలల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడటం వంటి నేరాలకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. బాలలపై జరిగే హింస, వేధింపులు, లైంగిక దోపిడీ, ఇతర అనుచిత చర్యలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపుల నివారణ, ఆన్‌లైన్ భద్రత, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, వాటి ప్రాముఖ్యతతోపాటు అవసరమైన సందర్భాల్లో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. బాలల భద్రత తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాదని, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని న్యాయమూర్తి స్పష్టం చేశారు. బాలల హక్కులను గౌరవిస్తూ వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు అప్రమత్తంగా ఉంటూ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది కాట్రూత్ రాజు నాయక్, డాన్ బాస్కో పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి, ప్రిన్సిపల్ మేఘన, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రవీణ్, వరలక్ష్మి, ధన, నాగశ్రీ, లీగల్ సర్వీసెస్ సిబ్బంది తలారి అరుణ, వై. శ్రీనివాస్, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి: ఎంపీ రఘునందన్ రావు

నర్సాపూర్, అక్టోబర్ 30 (సందేశం టైమ్స్): దేశంలో ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విద్యార్థులకు సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా దేశంలోని ఏ కార్యక్రమంపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని పౌరుడి ఓటు తొలగిపోదని ఆయన పేర్కొన్నారు. మరోసారి మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. గురువారం మెదక్ నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ అధికారంలోకి రాకూడదనే జిల్లా నర్సాపూర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై విద్యార్థులతో ఉద్దేశంతోనే ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్నాయని ఎంపీ నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలనను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిపక్షాలు తట్టుకోలేక కొంతమందిని రెచ్చగొట్టి ఆందోళన విద్యార్థులు పాల్గొనగా, ఎంపీ వారికి ఎస్ఐఆర్ ప్రక్రియపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ఎస్ఐఆర్ అవగాహన కల్పించారు.



నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డెంటల్ క్లినిక్ ప్రారంభం.. ఎంపీ నిధులతో రూ.3 లక్షలతో అధునాతన యంత్రాల ఏర్పాటు

నర్సాపూర్, అక్టోబర్ 30 (సందేశం టైమ్స్): మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డెంటల్ క్లినిక్ విభాగాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు దంత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో తన ఎంపీ నిధుల నుంచి రూ.3 లక్షలు వెచ్చించి అధునాతన దంత వైద్య యంత్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నర్సాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన డెంటల్ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కోరారు. దంత సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ఈ విభాగం ద్వారా మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో డెంటల్ క్లినిక్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు సాగు చేయాలి: కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్



నర్సాపూర్, అక్టోబర్ 30 (సందేశం టైమ్స్): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో యాసంగి సీజన్‌లో తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఆవంచ రైతు వేదికలో భూమి బచావో అభియాన్ (సాగు భూమి సంరక్షణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శనగ, కుసుమ, జొన్న, పెసర, మినుము వంటి తక్కువ నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయాలని, అధిక నీరు అవసరమయ్యే వరికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. భూసారాన్ని కాపాడుకుంటూ అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, భూగర్భ జలాలపై ఒత్తిడిని తగ్గించేందుకు పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని వివరించారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును కూడా చేపట్టవచ్చని, ప్రభుత్వం సబ్సిడీపై ఒక్కో మొక్కను రూ.20 చొప్పున అందిస్తుందని, ఎకరానికి 57 మొక్కలు నాటుకోవచ్చని తెలిపారు. అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.4,200 చొప్పున రైతు భరోసాతో పాటు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు. పంటల మార్పిడి ద్వారా నేల సారాన్ని మెరుగుపరుచుకోవచ్చని, ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ పంటలను సాగు చేయాలని సూచించారు. నేలలో తేమను కాపాడే వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ నూతన వ్యవసాయ విధానాలు, సేంద్రియ పద్ధతులను పాటించి మెరుగైన దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కర్ణాకర్, ఉపసర్పంచ్ కిష్టయ్య, ఎంపీటీసీ విజయ్, వ్యవసాయ విస్తరణ అధికారులు దీపిక, లావణ్య, బీటీఎం హరిత, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర: ఐకేపీ ఏపీఎం దేవేందర్

అందోల్, అక్టోబర్ 30 (సందేశం టైమ్స్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఐకేపీ ఏపీఎం దేవేందర్, కన్సాన్‌పల్లి సర్పంచ్ తెనుగు సునీత తెలిపారు. గురువారం అందోల్ మండల పరిధిలోని కన్సాన్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ కలిపి రూ.2,961 అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించే సమయంలో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే ముందు తాలు లేకుండా, తేమ శాతం 17 శాతంలోపు ఉండేలా నిబంధనలను పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శేరి సంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలయ్య, ఉపసర్పంచ్ పెంటయ్య, వార్డు సభ్యులు మహిపాల్, మాధవరెడ్డి, శివచందర్, లక్ష్మీసదానందం, రమాదేవి, దుర్గేష్, యువ నాయకులు రమేశ్‌గౌడ్, బాల్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సీసీ సత్యనారాయణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి, కోశాధికారి పెంటమ్మ, వీఓఏ అంజనేయులు, రవీందర్, జోగాల అంజయ్య, సత్తయ్య, దుర్గయ్య, కె. రమేశ్, పంతులు ఈశ్వర్, వెంకటేశం, యాదయ్య, అనిల్, గంగరాం తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. యువత, వ్యసన బాధితులకు ఎస్పీ పరితోష్ పంకజ్ సూచన

సంగారెడ్డి, అక్టోబర్ 30 (సందేశం టైమ్స్ ప్రతినిధి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చెడు అలవాట్లను విడిచిపెట్టి ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన ఆయన, మత్తు పదార్థాల వ్యసనానికి గురైన వారు సరైన చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం ద్వారా సాధారణ జీవితానికి తిరిగి రావచ్చని తెలిపారు. ఎస్-నాబ్ ఆధ్వర్యంలో డీ-అడిక్షన్ సెంటర్‌కు ఇండోర్ క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతోపాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంచుతాయని పేర్కొన్నారు. వ్యసన బాధితులకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని వైద్యులను కోరారు. మత్తు పదార్థాలకు అలవాటు పడినవారిని చిన్నచూపు చూడకుండా, వారు ఆ వ్యసనం నుంచి బయటపడేందుకు కుటుంబ సభ్యులు, సమాజం సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆర్ఎంఓలు, ఎస్-నాబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్తు పొదుపులో రైతులు, వినియోగదారులు సహకరించాలి.. వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఎస్ఈ నారాయణ నాయక్

మెదక్, అక్టోబర్ 30 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జిల్లాలో విద్యుత్తును పొదుపుగా వినియోగించేందుకు రైతులు, గృహ విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని జిల్లా విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ నారాయణ నాయక్ కోరారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గృహ విద్యుత్తు వినియోగం పెరిగినప్పటికీ ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్తు అందించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి పంటకు బదులుగా ప్రభుత్వం సూచించిన ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దీనివల్ల విద్యుత్తు వినియోగం తగ్గడంతోపాటు భవిష్యత్తులో విద్యుత్తు సరఫరాపై ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. ఈ అంశంపై జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గృహాలు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను అవసరమైన మేరకే వినియోగిస్తూ విద్యుత్తును వృథా చేయకుండా పొదుపు చేయాలని సూచించారు. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు తీగలు, ఫ్యూజులు, ఎర్తింగ్ వైర్లను నిరంతరం తనిఖీ చేస్తూ అవసరమైన మరమ్మతులు చేపడుతున్నామని వెల్లడించారు. వినియోగదారుల సమస్యలపై శాఖాధికారులు, సిబ్బంది వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు సరఫరా కోసం రైతులు, వినియోగదారులు విద్యుత్తు శాఖకు సహకరించాలని నారాయణ నాయక్ విజ్ఞప్తి చేశారు.



పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

మెదక్, అక్టోబర్ 30 – సందేశం టైమ్స్ ప్రతినిధి: పిల్లలను లైంగిక వేధింపులు, దాడులు, దోపిడీ నుంచి రక్షించడమే పోక్సో చట్టం ప్రధాన ఉద్దేశమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రుబీనా ఫాతిమా అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మెదక్ పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్–పాన్ ఇండియా స్కూల్ అవేర్‌నెస్ క్యాంపెయిన్'లో భాగంగా పోక్సో చట్టం–2012పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెయింట్ డాన్ బాస్కో ఉన్నత పాఠశాల, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్‌గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికలు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మినీ గురుకులం పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుబీనా ఫాతిమా మాట్లాడుతూ పిల్లలకు చిన్న వయస్సు నుంచే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా అనుచితంగా తాకినా, అసౌకర్యానికి గురిచేసినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని చెప్పారు. పిల్లల భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, బాలల హక్కుల పరిరక్షణలో సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాను వినియోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితులకు వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంపకూడదని, ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు లేదా మోసాలు ఎదురైతే సంబంధిత ఆధారాలను భద్రపరచి పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమాల్లో ఆర్సీఓ గంగారాం, మెదక్ మండల విద్యాధికారి శంకర్, ప్యానల్ న్యాయవాది కేఎల్ఎన్. దత్ తదితరులు పాల్గొన్నారు.



రీ సర్వేపై అపోహలు వద్దు.. భూభారతి రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 30 (సందేశం టైమ్స్ ప్రతినిధి): భూభారతి రీ సర్వేపై గ్రామ ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. టేక్మాల్ మండలం ఏక్లాస్‌పూర్ గ్రామంలో నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామ పరిధిలోని 718 ఎకరాల్లో రీ సర్వే చేపట్టి భూములకు స్పష్టమైన హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారికి ముందుగా నోటీసులు జారీ చేసి, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం, అటవీ భూములు, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల భూముల సర్వే పూర్తయిన అనంతరం పట్టా భూములను సర్వే చేస్తామని వివరించారు. భూ వివాదాలకు తావులేకుండా ప్రతి భూకమతానికి స్పష్టమైన హద్దులు నిర్ణయించడమే రీ సర్వే ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏడీ సర్వే అధికారి కిషన్ మాట్లాడుతూ ఏక్లాస్‌పూర్‌లో వారం రోజుల్లో రీ సర్వే ప్రారంభిస్తామని తెలిపారు. సర్వేకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. ఆర్డీఓ రమాదేవి మాట్లాడుతూ భూములకు సంబంధించి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరామ్, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలల పట్ల సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



